
ఫాగింగ్ నిల్.. దోమలు ఫుల్!

బండ్లగూడ చెరువు వద్ద పేరుకపోయిన చెత్త

● మూసీ పరివాహక ప్రాంతంలో దోమల స్వైరవిహారం
● అనారోగ్యం పాలవుతున్న జనం
● నివారణ చర్యలు పట్టని ఎంటమాలజీ అధికారులు



దోమలకు నిలయంగా మారిన బండ్లగూడ చెరువు డ్రైనేజీ నీరు

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని కొత్తపేట, నాగోలు డివిజన్లలోని పలు ప్రాంతాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమల వల్ల కంటి మీద కునుకు కరువు అవుతోందని, దోమ కాటుతో అనారోగ్యం పాలువుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు వాపోతున్నారు.

◆ మూసీ పరివాహక ప్రాంతమైన కొత్తపేట డివిజన్ పరిధిలోని సత్యానగర్, న్యూమారుతీనగర్, విద్యుత్‌నగర్, జనప్రియ క్వార్టర్స్, సమతాపురికాలనీ, నాగోలు డివిజన్ పరిధిలోని మమత నగర్ కాలనీ, సాయిరాం నగర్‌కాలనీ, జైపురికాలనీ, వెంకటరమణా కాలనీ. బండ్లగూడ చెరువు పరిసర ప్రాంత కాలనీలు, ఫతుల్లాగూడ పరిసర ప్రాంతాల్లో సైతం దోమల వ్యాప్తితో ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఉంది.

◆ దోమల నివారణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, అసలు జీహెచ్ఎంసీలో దోమలు నివారించే ఎంటమాలజీ విభాగం ఉందా? అనే సందేహం వస్తోందని పలు కాలనీల ప్రజలు వాపోతున్నారు.

◆ దోమకాటు కారణంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉన్నప్పటికీ ఎంటమాలజీ విభాగం అధికారులు ఫాగింగ్‌పై దృష్టి సారించలేకపోవడంపై కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

◆ తమ కాలనీల్లో దోమలు ఎక్కువగా ఉన్నాయని, నివారణ చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి పలు మార్లు తీసుకెళ్లినా ఫాగింగ్ చేసేందుకు ఎవరూ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ దోమకాటు వల్ల జనం విష జ్వరాల బారిన పడటంతో పాటు చర్మంపై దద్దుర్లు రావడం వంటి సమస్యలతో ఆసుపత్రుల పాలవుతున్నారని చెప్పారు.

◆ ఇప్పటికైనా సంబంధిత విభాగం అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు కొత్తపేట, నాగోలు డివిజన్ల పరిధిలో పలు కాలనీల ప్రజలు కోరుతున్నారు.

'దివ్యాంగుల సంబురాలు'



సంబురాల్లో పాల్గొన్న ముత్తినేని వీరయ్య తదితరులు

చాదర్‌ఘాట్: తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడంపై దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ వికలాంగుల విభాగం చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. బుధవారం ఆయన మలక్‌పేటలో దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో దివ్యాంగులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగానే కాకుండా అన్ని రంగాల్లో నష్టపోయారన్నారు. వికలాంగుల సమస్యలపై అవగాహన లేని పాలన చేయడంతో వికలాంగుల సమాజం నష్టపోయిందన్నారు. అందుకే వికలాంగుల కుటుంబాలు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచాయన్నారు. కాంగ్రెస్ విజయానికి తోడ్పడిన పార్టీ వికలాంగుల విభాగం నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సతీష్ గౌడ్, సురేష్, చారి, పరమేష్, వెంకన్న, నరసింహాచారి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న తూర్పాటి చిరంజీవి, కాలనీవాసులు

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందు ఉంచేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం నాగోలు డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి ఆధ్వర్యంలో డివిజన్‌లో వివిధ కాలనీలకు చెందిన వారు సుధీర్‌రెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు దేప మధుసూదన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రవీంద్రర్‌రెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో వివిధ కాలనీ చెందిన పలువురు కాలనీ వాసులు సుధీర్‌రెడ్డి కలిసి అభినందించారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి

● మలక్‌పేట ఎమ్మెల్యే బలాల



బలాలను సన్మానిస్తున్న క్రిస్టియన్ అసోసియేషన్ నాయకులు

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యేగా మజ్లిస్ పార్టీ నుంచి నాలుగోసారి విజయం సాధించిన అహ్మద్ బలాలను బుధవారం మలక్‌పేట క్రిస్టియన్ అసోసియేషన్ నాయకులు పంజేషాహ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బలాలను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రైస్తవులకు అండగా నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుత్తి సాల్మన్ రాజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు రాణిప్రమీల, సభ్యులు ఉన్నారు.

చైర్మన్ రాజీనామాతో ఛాంబర్‌కు తాళం!



చైర్మన్ ఛాంబర్‌కు తాళం వేసిన దృశ్యం

చాదర్‌ఘాట్: నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ పదవికి వాసుదేవరెడ్డి రాజీనామా చేశారు. దీంతో మలక్‌పేటలోని వికలాంగుల సహకార సంస్థ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌కు సిబ్బంది తాళం వేశారు. వాసుదేవరెడ్డి పదవీ కాలం ఈనెల 22తో ముగియనుండగా, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆయన ముందుగానే తన పదవికి రాజీనామా చేశారు. కాగా, చైర్మన్ పదవి కోసం దివ్యాంగుల నాయకులు జోరుగా తమకు తెలిసిన కాంగ్రెస్ సీనియర్ నాయకుల ద్వారా పైరవీలు మొదలు పెట్టారు.

ఏసీపీ, సీఐలకు 'జాగృతి' సత్కారం



సత్కరిస్తున్న భావన శ్రీనివాస్ తదితరులు

హస్తినాపురం: అసెంబ్లీ ఎన్నికల్లో వనస్థలిపురం సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి, సీఐ జలేంధర్‌రెడ్డిలను జాగృతి అభ్యుదయ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. జాగృతి చైర్మన్ భావన శ్రీనివాస్, రంగనాథ్, ఇస్మాయిల్‌గురూజీ, తదితరులు పాల్గొన్నారు.

విజేత ఎమ్మెల్యేల పేరిట ప్రత్యేక పూజలు




ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, సబితారెడ్డిలకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి తదితరులు

చంపాపేట: ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎల్‌బీనగర్, మహేశ్వరం ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి పేరు మీద కర్మన్‌ఘాట్‌లోని శ్రీధ్యానాంజనేయ స్వామికి బుధవారం అభిషేకాలు, స్వర్ణపత్ర, పుష్పార్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహిచారు. ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. అనంతరం పాలక మండలి సభ్యులు, ఆలయ పూజారులు ఎమ్మెల్యేల క్యాంప్ ఆఫీస్‌కు వెళ్లి వారిని వేద మంత్రోశ్చరణలతో ఆశీర్వదించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాస శర్మ, పాలక మండలి సభ్యులు మేక సురేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, తిరుమలేష్, శ్రీనివాసయాదవ్, ఆలయ అర్చకులు ప్రవీణ్‌శర్మ, అంబ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

హరిత శోభితం..'రోమా-2'

● మొక్కల పెంపకంపై కాలనీవాసుల ప్రత్యేక శ్రద్ధ
● సమష్టి కృషితో సత్ఫలితాలు



పచ్చని చెట్ల మధ్య రోమా-2 కాలనీ

ఏపుగా పెరిగిన మొక్కలు.. ఎటుచూసినా రోడ్డుకిరువైపులా ఇళ్ల ముందర ఏపుగా పెరిగిన చెట్లు ఎటు చూసినా పచ్చదనం.. కాలనీవాసుల ప్రత్యేక శ్రద్ధతో కాలనీ హరితమయంగా మారింది.

బడంగ్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌లోని రోమా-2 కాలనీకి పచ్చదనంతో కట్టిపడేస్తుంది. కాలనీవాసుల ప్రత్యేక శ్రద్ధ, సమష్టి కృషితో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. 2008లో బడంగ్‌పేటలోని రోమా-2 కాలనీని ఏర్పాటు చేశారు. గతంలో నీటి కోసం ఇబ్బంది పడిన ఈ కాలనీవాసులంతా కలిసి సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకుని ఇంటింటికీ బోరు వేయించుకున్నారు. గృహ అవసరాలకు వాడిని నీటిని వృథా చేయకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని అందులోకి మళ్లిస్తున్నారు. వర్షాలు కురువాలంటే వనం ఉండాలని అనుకుని ప్రతీ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి పెంచి పెద్ద చేశారు. అవి ఇప్పుడు ఏపుగా పెరిగి చక్కని గాలిని, నీడను, పండ్లను అందిస్తున్నాయి. 53 కుటుంబాలున్న ఈ కాలనీ ఆహ్లాదకర వాతావరణం పలు కాలనీలకు ఆదర్శంగా నిలుస్తోంది. స్థానిక కార్పొరేటర్ ఇనుప బెంచీలు ఏర్పాటు చేయడంతో చెట్లకింద సేద తీరుతున్నారు. ఈ కాలనీ నిత్యం సీసీ కెమెరాల నిఘా నీడలో ఉంటున్నాయి.

'భగీరథ' నీరు వస్తోంది



మేము వచ్చిన కొత్తలో నీళ్లకు ఇబ్బందులు పడే వారం. ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకున్నాం. అప్పటినుంచి నీటి ఇబ్బందులు తొలిగాయి. ఇప్పుడు మిషన్ భగీరథ వాటర్ వస్తున్నాయి. ప్రతీ ఇంటి ఎదుట పండ్ల మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలు పెంచాం. కార్పొరేటర్ సైతం కాలనీ అభివృద్ధికి సహకరిస్తున్నారు.

– దానియల్, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్



చంపాపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మలక్‌పేటలో.. కాంగ్రెస్ నేతలు షేక్ అక్బర్, విజయసింహారెడ్డి తదితరులు

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

మలక్‌పేట/ఎల్బీనగర్ జోన్ల బృందం: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం పలువురు ఘన నివాళులర్పించారు. ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని, వారి అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



హస్తినాపురం డివిజన్ సుభాష్‌చంద్రబోస్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎల్‌బీనగర్‌లో ... బీఆర్ఎస్ బీసీ సెల్ నేత రుద్ర యాదగిరి



నాగోలు జైపురికాలనీలో... శ్యామల యాదగిరి తదితరులు



ఎల్‌బీనగర్‌లో.. నివాళులర్పిస్తున్న సీపీఐనేత ఆందోజు రవీంద్రాచారి తదితరులు



ఎన్టీఆర్‌నగర్‌లో.. యువజన కాంగ్రెస్ నేతలు చిలుక ఉపేందర్‌రెడ్డి, అల్లేటి కిరణ్ కుమార్ తదితరులు



ఎన్టీఆర్‌నగర్‌లో.. కేవీపీఎస్, గిరిజన సంఘాల నాయకులు



మూసారంబాగ్‌లో.. ఎమ్మార్పీఎస్ కార్యదర్శి ప్రభాకర్, టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ చంద్రశేఖర్



మూసారంబాగ్‌లో.. కార్పొరేటర్ భొక్క భాగ్యలక్ష్మి తదితరులు

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడా పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు

హుడాకాంప్లెక్స్: వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని సరూర్ నగర్ తహసీల్దార్ జయకృష్ణ అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సరూర్‌నగర్‌లోని రంగారెడ్డి జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని, వికలాంగులకు ప్రత్యేకమైన క్రీడలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. జిల్లా నోడల్ అధికారి రమేశ్ మాట్లాడుతూ.. బుద్ధిమాంద్యం ఉన్న వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. 2016లో కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల కోసం ప్రత్యేక చట్టం రూపొందించారని, రాష్ట్రంలో 5 లక్షల 20 వేల మంది దివ్యాంగులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. అన్ని శాఖల్లో 5శాతం రిజర్వేషన్లు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సకలాంగులకు దీటుగా వికలాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పునరావాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నుంచి మేడి పాపయ్య బహిష్కరణ



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మేడి పాపయ్యను ఆ సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ తెలిపారు. బుధవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వంగపల్లి మాట్లాడుతూ.. వ్యక్తిగత అవసరాల కోసం సంఘాన్ని వాడుకుంటూ, సంఘం పరువుపోయేలా వ్యవహరిస్తున్నందుకు మేడి పాపయ్యను ఎమ్మార్పీఎస్ నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఎమ్మార్పీఎస్ పేరును వాడుకున్నా, ఇతర కార్యక్రమాలకు పాల్పడిన తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పసలాది యాదగిరి, వరిగడ్డి చందు, జన్నారం జీవన్, ధర్మారపు శ్రీకాంత్, కె.సురేష్, మనీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే గెలిపించింది



సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న అర్జున్ తదితరులు

పహాడీషరీఫ్: మహేశ్వరం ఎమ్మెల్యేగా విజయం సాధించిన పట్లోళ్ల సబితారెడ్డికి జల్‌పల్లి మున్సిపాలిటీ యువజన విభాగం కార్యనిర్వాహక అధ్యక్షుడు యంజాల అర్జున్ బుధవారం శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమె నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు. గడిచిన ఐదేళ్ల కాలంలో మంత్రిగా ఉండి ఆమె చేసిన అభివృద్ధి పనులే భారీ మెజార్టీతో గెలిపించాయని ఆయన అన్నారు.

'నూతన ప్రభుత్వానికి అండగా ఉంటాం'

చాదర్‌ఘాట్: రాష్ట్రంలో ఏర్పడ్డ నూతన ప్రభుత్వానికి రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ఎన్ చారి శుభాకాంక్షలు తెలిపారు. మలక్‌పేటలోని సంస్థ ప్రాంగణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతన ప్రభుత్వంలో వికలాంగుల సహకార సంస్థ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని అమలు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి తమ సంస్థ ఉద్యోగుల అండదండలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రాములు, అడ్వైజర్లు వెంకటేశ్వరరావు, వెంకల రాములు పాల్గొన్నారు.

పాతనేరస్తుడిపై రౌడీషీట్



నిందితుడు మంజునాథ్

హస్తినాపురం: నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న ఓ పాతనేరస్తుడిపై వనస్థలిపురం పోలీసులు రౌడీషీట్ తెరిచారు. సీఐ జలేంధర్‌రెడ్డి కథనం ప్రకారం.. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని శారదానగర్‌కు చెందిన పోతనబోయిన మంజునాథ్ (26)పై వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌తో పాటు నగరంలోని ఇతర పోలీస్‌స్టేషన్ల పరిధిలో బెదిరింపులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినందుకు 7 కేసులు నమోదయ్యాయి. జైలు జీవితం గడిపినా కూడా అతనిలో మార్పు రాకపోగా, తిరిగి కొంతమందిని బెదిరించి డబ్బులు, ఇతర విలువైన వస్తువులు తీసుకెళ్తున్నాడు. ఇదే విధంగా ఈ నెల 2న పీల ఈశ్వర్‌గణేశ్ అనే విద్యార్థిని బెదిరించి పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వనస్థలిపురం పోలీసులు..మంజునాథ్ నేర చరిత్రపై ఏసీపీ భీంరెడ్డికి నివేదిక పంపారు. ఏసీపీ ఆదేశాల మేరకు నిందితుడిపై రౌడీషీట్ తెరిచారు. కాగా, పరారీలో ఉన్న మంజునాథ్ కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి

కాచిగూడ: తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని బీసీల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. బీసీలకు రాష్ట్ర మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలని అన్నారు. పేదలకు, బడుగు బలహీన వర్గాలకు అన్ని పథకాలు అందేలా, సాయం చేసేలా ప్రభుత్వం ముందుకు వెళ్లాలని దుండ్ర కుమారస్వామి అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ చెప్పినట్లుగా బీసీలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని అన్నారు.

నేడు బీఆర్ఎస్ విజయోత్సవ ర్యాలీ

మహేశ్వరం: మహేశ్వరం ఎమ్మెల్యేగా పట్లోళ్ల సబితారెడ్డి గెలుపొందిన సందర్భంగా గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభించే ఈ ర్యాలీ శివగంగ రాజరాజేశ్వర ఆలయం నుంచి పోతర్ల బాబయ్య ఫంక్షన్ హాల్ వరకు ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరవుతున్నారన్నారని, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 15, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి35, కాకర 35, బీర 40, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 11, కారెట్ 23. దొండ 40, ఆలు 23, ఉల్లి 36, గోకర 35, దోస 23, సొర 11, పొట్ల 15, అరటి 09, చిక్కుడు 45, అర్వి 23.